సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా


పవర్ బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: నియోజకవర్గంలోని వివిధ కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. తిరుమలగిరి ఇందిరా నగర్ కాలనీలో పవర్‌బోర్ వెల్ పనులను శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇందిరా కాలనీలో పర్యటించిన సందర్భంగా స్థానికులు నీటి సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని ప్రభుత్వ నిధులు వెచ్చించి పవర్‌బోర్‌వెల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మురళి ముదిరాజ్, నాగినేని సరిత, భవాని, రంగా రవీందర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులే టార్గెట్‌గా వసూళ్ల పర్వం!

అమీర్‌పేట: రోడ్లు,కాలనీ బస్తీల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారు. ఫుట్ పాత్‌లను ఆక్రమించి చిన్నా చితక వ్యాపారాలు చేసే వారిని టార్గెట్‌గా చేసుకుని నెల నెలా మామూళ్లు దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా నడుస్తున్నట్లు తెలుస్తోంది. పారిశుద్ధ్య కార్మికులను సమన్వయం చేసుకుని పనులను పర్యవేక్షించాల్సిన కొందరు శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది. ఏరియాతో సంబంధం లేకుండా అమీర్‌పేట, బల్కంపేట, సనత్ నగర్ ఎస్ఆర్‌టీ, బీకేగూడ, మైత్రివనమ్, సత్యం థియేటర్ పరిసరాల్లో ఉన్న ఏ ఒక్క వ్యాపారినీ వదలడం లేదనే ఆరోపణలున్నాయి. ఫుడ్ ట్రేడ్ లైసెన్సుల పేరుతో వేలల్లో డబ్బులు దండుకుంటున్నారని ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఫాస్ట్ ఫుడ్ స్టాల్ నడిపే యువకుడు వాపోయాడు. డబ్బులు ఇవ్వకపోతే స్టాల్ మూసి వేయిస్తామని బెదిరిస్తుండడంతో చేసేదేమీలేక అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. పారిశుద్ధ్య కార్మికులను సైతం వీరు వేధిస్తున్నట్లు సమాచారం.ప్రమాదవశాత్తు, అనారోగ్యం కారణంగా ఎవరైనా చనిపోతే వారి స్థానంలో కుటుంబ సభ్యులను ఉద్యోగంలో పెట్టిస్తానని చెప్పి లక్షల్లో డబ్బులు తీసుకుని వేరే వ్యక్తులను పెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మామూళ్ల మత్తులో పారిశుద్ధ్య నిర్వాహణను అసలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారుల పాత్ర కూడా ఉండటం వల్లే ఇలా మితిమీరి వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపట్టి సదరు ఫీల్డ్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏఎమ్ హెచ్ ఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

టీచర్లు లేరు.. ఆయాలు లేరు..

జూన్ నుంచి ఇదే పరిస్థితి..

- ఎప్పుడు చూసినా మూసివేత..
- అల్లావుద్దీన్ కోఠి రెండు అంగన్‌వాడీ సెంటర్లలో ఇదీ పరిస్థితి


అంగన్‌వాడీ సెంటర్లు కొనసాగుతున్న కమ్యూనిటీ హాల్ భవనం ఇదే.. (మొదటి అంతస్తు)..

సనత్‌నగర్: పేరుకు ఆ బస్తీలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఏ ఒక్కటీ సరిగా అందుబాటులో ఉండడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యాలను నెరవేర్చేందుకు అక్కడ అసలు టీచర్లే లేరు..ఇక వారు లేకపోవడంతో ఆయాలూ లేకుండాపోయారు. ఫలితంగా ఇక ఆ రెండు సెంటర్లు మూసివేసే ఉంటున్నాయి. ఎప్పుడో ఒకసారి ఇన్‌చార్జిగా ఉన్న సమీపంలోని అంగన్‌వాడీ టీచర్ వచ్చి పోషకాహారం అందించి వెళ్తుంది. అయితే ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు ఆహారం అందిస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇదీ సనత్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్ల దుస్థితి. గర్భిణీ మహిళలకు, బాలింతలకు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించి వారి శారీరిక, మానసిక ఎదుగుదలకు తోడ్పాటునందించాలన్నదే అంగన్‌వాడీ సెంటర్ల ప్రధాన ఉద్దేశ్యం. అలాగే చిన్నారుల కోసం ప్రీ స్కూల్ నిర్వహణ కూడా అంగన్‌వాడీ కేంద్రాల వేదికగా జరుగుతుంటుంది.

అల్లావుద్దీన్ కోఠి–1, అల్లావుద్దీన్ కోఠి–2 పేరిట రెండు అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. గత జూన్ వరకు ఇక్కడ అంగన్‌వాడీ టీచర్లు విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. ఆయాలు మాత్రం లేరు. ఒక సెంటర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ ఆరోగ్య రీత్యా రావడం మానేశారు. అప్పటి నుంచి రెండు సెంటర్ల నిర్వహణ భారం ఒక టీచర్ పైనే పడింది. రెండు సెంటర్లలో కలిసి 30 మంది వరకు చిన్నారులు, 40 మంది వరకు బాలింతలు, గర్భిణీలు ఉండేవారు. వీరందరికీ పోషకాహారం వండి అందించడంతో పాటు పిల్లలకు ప్రీ స్కూల్ నిర్వహణ చేపట్టడం ఆ టీచర్‌కు తలకుమించిన భారంగా మారింది. ఈ క్రమంలో అత్యవసర పరిస్థితులు దృష్ట్యా సెలవులు కూడా దొరకపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనైనా సదరు అంగన్‌వాడీ టీచర్ జూన్ 3 నుంచి రావడం మానేశారు. ఇక అప్పటి నుంచి రెండు అంగన్‌వాడీ సెంటర్లకు దిక్కు కరువైంది. దీంతో చిన్నారులు ఇంటికే పరిమితమైపోయారు. కానీ ఇక్కడ వాటిని అందించేందుకు అసలు టీచర్లు, ఆయాలు లేకపోవడంతో మూసివేసే ఉంటున్నాయి. ఫలితంగా ప్రీ స్కూల్ నిర్వహణ అటకెక్కగా..బాలింతలు, గర్భిణీ మహిళలకు పోషకారం ఎప్పుడు అందుతుంది..అసలు అందుతుందా? లేదా అని ప్రశ్నార్థకంగా మారుతోంది.


మూసివేసి ఉన్న అంగన్‌వాడీ సెంటర్

వైభవంగా అయ్యప్ప మహా పడి పూజ


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: అంజయ్యనగర్‌లో సోమవారం అయ్యప్ప స్వామి మహా పడి పూజను వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, బాలింగ్ గౌతమ్ గౌడ్, గోవర్ధన్, భాస్కర్ రెడ్డి, నర్సింహాసాగర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్ వాడీ కేంద్రానికి విద్యుత్తు కనెక్షన్‌ను పునరుద్ధరించండి


స్థానికులతో కలిసి నిరసన దిగిన మాజీ ఎమ్మెల్యే

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బీకేగూడ మజీద్ బస్తీలో ఉన్న అంగన్ వాడీ కేంద్రానికి విద్యుత్తు కనెక్షన్‌ను పునరుద్ధరించాలని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానికులతో కలిసి అంగన్ వాడీ కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసూన మాట్లాడుతూ విద్యుత్తు బిల్లు బకాయి ఉండటంతో కనెక్షన్ కట్ చేసి 9 ఏళ్లు అవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సిబ్బంది, స్థానికులు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని అన్నారు.

జనవరి 5న మాదిగ విద్యార్థి గర్జన సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జనవరి 5న మాదిగ విద్యార్థి గర్జన సభను నిర్వహించనున్నట్లు ఎస్టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు తాళ్ల అజయ్ తెలిపారు. సోమవారం ఓయూ ఫ్యాకల్టీ క్లబ్‌లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పై సుప్రీమ్ కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో పాల్వాయి నగేష్, శ్రీకాంత్, సుమంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి


ఎలక్ట్రికల్ డీఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: తుకారాంగేట్ వడ్డెర బస్తీలోని అంగన్‌వాడీ కేంద్ర భవనానికి ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ఇతర చోటుకు మార్చాలని అడ్డగుట్ట డివిజన్ బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు కన్నాభిరాం అధికారులను కోరారు. ఈ మేరకు వడ్డెర సంఘం కమిటీ సభ్యులతో కలిసి గాంధీ ఆస్పత్రి సమీపంలోని ఎలక్ట్రికల్ డీఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. శివలింగం చారీ, రవీందర్, శ్యామ్, శ్రీకాంత్, శ్రీనివాస్, బిక్షపతి తదితరులు ఉన్నారు.

లాలాగూడ సాక్రెడ్ హార్ట్ చర్చిని కాపాడాలి


బీజేపీ నాయకుడు బండ చంద్రారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

లాలాపేట: దాదాపు 100 సంవత్సరాల చరిత్ర కల్గిన సికింద్రాబాద్ లాలాగూడలోని సాక్రెడ్ హార్ట్ చర్చిని కాపాడాలనీ చర్చి నిర్వాహకులు కోరుతున్నారు. ఈ విషయమై చర్చి ప్రతినిధి బృందం సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డిని ఆయన నివాసంలో కలిసారు. చారిత్రాత్మకమైన చర్చి విషయంలో ఇటీవల రైల్వే అధికారులు తెలిపిన అభ్యంతరాలు, డిసెంబర్ 12 వరకు చర్చిని వేకెంట్ చేయాలనీ ఇచ్చిన నోటీసు విషయాన్ని చంద్రారెడ్డితో చర్చించారు.

మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డికి నివాళి


మర్రి చెన్నారెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

సనత్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత మర్రి చెన్నారెడ్డికి సనత్‌నగర్ నియోజకవర్గ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీలకతీతంగా నేతలు రాక్ గార్డెన్‌లో జరిగిన వర్ధంతి వేడుకల్లో పాల్గొని సీఎంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ నేత షేక్‌గౌస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలివెళ్లి చెన్నారెడ్డికి నివాళులు అర్పించారు. అలాగే బేగంపేటకు చెందిన నెమలి ఆనంద్, రవీందర్‌రెడ్డి తదితరులు చెన్నారెడ్డి సేవలను కీర్తించారు.

నిరాశ్రయులకు దుప్పట్లు అందజేసిన ట్రాఫిక్ ఏసీపీ



సనత్‌నగర్: చలితో వణుకుతూ ఫుట్‌పాత్‌లపై, బస్టాండ్, రైల్వే స్టేషన్ల వద్ద నిద్రిస్తున్న అభాగ్యుల పట్ల నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు స్పందించారు. ఆయా ప్రాంతాల్లో ఉంటున్న నిరాశ్రయుల వద్దకు వెళ్లి ఆయన దుప్పట్లను అందజేసి చలి పరిస్థితుల నుంచి విముక్తి కలిగించారు.

క్రమం తప్పకుండా తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రతి రోజు క్రమం తప్పకుండా తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ ప్రొ.కాశీంను విద్యార్థి నాయకులు కోరారు. సోమవారం ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో ప్రొ.కాశీంను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందచేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాపారావు, పులిగంటి సురేష్ పాల్గొన్నారు.

అన్ని అధ్యయన కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు


నిరసన ప్రదర్శనలో అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగులు

- జేఏసీ సభ్యుల వెల్లడి
- 74వ రోజుకు చేరిన అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసనలు

బంజారాహిల్స్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని అధ్యయన కేంద్రాల్లో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జేఏసీ సభ్యులు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయ స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. గత 74 రోజులుగా జేఏసీ సభ్యులు, ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి, నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యమన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) చైర్‌పర్సన్ పల్లవీ కాబడే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డి, ఎల్వీకే రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు రబీంద్రనాథ్ సోలమన్, యాకేష్ దైద, రజనీ, మేరీ సునంద, ఉదయిని, కిషోర్, రాఘవేంద్ర, రజిత, షబ్బీర్, పాండు, రాములు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

నగదు బ్యాగ్ లాక్కొని ఉడాయించిన ముగ్గురి అరెస్టు..


వివరాలు వెల్లడిస్తున్న బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య

రూ.2 లక్షలు స్వాధీనం..

సనత్‌నగర్: రూ. 2 లక్షల నగదును బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్తున్న ఓ వ్యక్తి నుంచి బ్యాగ్‌తో ఉడాయించిన ముగ్గురిని బేగంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఇన్‌స్పెక్టర్ రామయ్య, డీఐ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఏసీపీ గోపాలకృష్ణమూర్తి వివరాలను వెల్లడించారు. బేగంపేటలోని కుమార్ వేలు బ్రదర్స్‌కు చెందిన రోజువారీ కలెక్షన్‌ను ఎంజీ రోడ్డులోని జేమ్స్‌స్ట్రీట్ కాస్మో బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తుంటారు. రోజూ ఏ సమయానికి కలెక్షన్ తీసుకువెళ్తారనే విషయాలను ఎదురుగా టీస్టాల్ నడిపే రసూల్‌పురాకు చెందిన సాయి రామ్ (23) గమనిస్తుండేవాడు. తన స్నేహితులు ఉప్పల్ చిలుకానగర్‌కు చెందిన మొరం శెట్టి శ్రీహరి (23), చవాన్ లోకేష్ (18)లతో కలిసి నగదును దోచుకోవాలని పథకం రచించాడు. గత నెల 26న రూ.2,13,000లను బ్యాగ్‌లో పెట్టుకుని బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు కుమార్‌తో పాటు మరోవ్యక్తి బయలుదేరాడు. అప్పటికే తాము వేసుకున్న పథకం ప్రకారం సాయి రామ్, శ్రీహరి, లోకేష్‌లు ముఖాలకు మాస్కులు ధరించి సిద్ధంగా ఉన్నారు. క్యాష్ బ్యాగ్‌తో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సదరు వ్యక్తిని వారు నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై అనుసరిస్తూ ఆనంద్ థియేటర్ వద్దకు రాగానే అతనిని ఆపి క్యాష్ బ్యాగ్‌ను లాక్కొని పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఏసీపీ గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో మధుసూదన్‌రెడ్డి ఈ కేసు విచారణలో భాగంగా సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనం, రూ.2 లక్షల క్యాష్, మూడు మొబైల్ ఫోన్లు, ఒక బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

వరదనీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు పరిశీలన


వరదనీటి పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌లో చేపట్టిన వరదనీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ సామల హేమ సోమవారం పరిశీలించారు. వర్షాకాలంలో వరదనీరు ఇళ్లను ముంచెత్తుతున్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు రూ. 70 లక్షల వ్యయంతో ఇందిరానగర్ రోడ్డు నంబరు 1 నుంచి 5 వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామని కార్పొరేటర్ హేమ తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగితెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడారు. జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉన్న వారికే ఉద్యోగాలు

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలో ఏటా 12 లక్షల మంది ఇంజినీర్లు తయారు అవుతున్నారని అందులో నైపుణ్యం గల 20 శాతం మందికే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఓయూ వీసీ ప్రొ.కుమార్ తెలిపారు. సోమవారం యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సదస్సు ప్రారంభమైంది. సదస్సుకు కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 40 ఏండ్లుగా టెలికమ్యూనికేషన్ రంగంలో అనేక మంది ఉపాధి పొందారన్నారు. ఈ రంగంలో ఇంకా 3 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఆస్పత్రికి ఆపరేషన్ గౌన్స్ వితరణ


ఆపరేషన్ గౌన్స్‌ను అందజేస్తున్న అనుతిరుమల

సనత్‌నగర్: యూఎస్ఏకు చెందిన అనుతిరుమల తన తల్లి అరవిందమ్మ జ్ఞాపకార్థం అమీర్‌పేట సివిల్ ఆస్పత్రికి ఆపరేషన్ థియేటర్ గౌన్స్‌ను వితరణ చేశారు. దాదాపు రూ.25 వేలు విలువ చేసే గౌన్స్‌ను సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ రవూఫ్, ఆర్ఎంఓ వినాయక్‌రావు, డాక్టర్ మహేష్‌లకు అందజేశారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.41, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 38, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 23, పందిరి బీర 38, క్యాబేజీ 26, క్యారెట్ 47, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 48, గోకరకాయ 23, కీర 22, దోసకాయ 21, బీట్‌రూట్ 47, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 38, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆక్రమణలను పరిశీలించిన హైడ్రా కమిషనర్


బేగంపేట ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ పరిసరాల్లో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ పరిసర ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం పర్యటించారు. వెల్కిన్ పార్క్ అపార్ట్‌మెంట్స్ సమీపం నుంచి వెళ్తున్న రసాయన నాలాపై 1150 గజాల స్థలంలో ఆక్రమణలు ఉన్నాయని స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో రంగనాథ్ అ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. బాలానగర్ నుంచి అంబర్‌పేటకు వెళ్తున్న రసాయన వ్యర్థాల నాలాపై కొందరు షెడ్లతో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారనే ఫిర్యాదు మేరకు రంగనాథ్ వారితో మాట్లాడారు. అయితే కొందరు స్థానికులు తాము చట్టబద్ధంగానే ఉన్నామని, తమకు అన్ని అనుమతులు ఉన్నాయని రంగనాథ్ దృష్టికి తీసుకువచ్చారు. తగిన ఆధారాలు కలిగిన పత్రాలను తమ కార్యాలయానికి పంపాలని రంగనాథ్ స్థానికులకు సూచించారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరిన సంఘ్ ప్రతినిధులు


యూనియన్‌లో చేరిన ప్రతినిధులతో మజ్దూర్ నాయకులు

చిలకలగూడ: రైల్వే ట్రేడ్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సౌత్ సెంట్రల్ రైల్వేస్ మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయు) బలం క్రమంగా పెరుగుతోంది. సికింద్రాబాద్ ఐఓడబ్ల్యు డిపార్ట్‌మెంట్‌లోని పలువురు ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులు జనరల్ సెక్రటరీ డాక్టర్ శంకరరావు నేతృత్వంలో సోమవారం మజ్దూర్ యూనియన్‌లో చేరారు. యూనియన్‌లో చేరిన సంఘ్ సభ్యులకు కండువా వేసి ఆహ్వానించారు. ఈనెల 4 నుంచి 6వ తేది వరకు జరిగే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌ను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు తామంతా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు ఉదయ్‌భాస్కర్, సరోజనిరెడ్డి, మురళీధర్, రవీందర్, చిల్కుస్వామి, నరసింహారెడ్డి, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



లక్డీకాపూల్: ఎర్త్‌హీరోస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెక్రటేరియట్, ట్యాంక్ బండ్,, గాంధీ హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో రాత్రివేళ చలికి వణుకుతున్న పలువురికి దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్‌పర్సన్ హాసినిరెడ్డి రావుల, సభ్యులు మౌనిక, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరికి వెళ్లొచ్చేలోగా ఇంట్లో చోరీ

వెంగళరావునగర్: ఊరికి వెళ్లి వచ్చేలోగా ఇంట్లో బంగారు వస్తువులు దోచుకెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సిద్ధార్థనగర్‌కాలనీలో నివసించే కె.గణేష్ ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. గతనెల 12వ తేదీన కాకినాడలో తన భార్య ప్రసవం కోసం గణేష్ కుమారునితో కలిసి వెళ్లాడు. తిరిగి ఈనెల 1వ తేదీన ఇంటికి వచ్చి చూడగా తలుపు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి ప్రవేశించి పరిశీలించగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉండాల్సిన పట్టీలు, కుంకుమ భరణి, చిన్న పిల్లలు ప్లేట్లు మాయం అయ్యాయి. మొత్తం దాదాపు రూ.50 వేలు ఖరీదు చేసే వస్తువులు చోరీకి గురైనట్టు బాధితుడు గణేష్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.